తర్వాత అతను రెండో కపాలం చెవిలోంచి ఆ దర్భపుల్లని పోనించాడు. అది దాని నోట్లోంచి బయటకి వచ్చింది.

"స్వామీ. ఇతనూ సామాన్యుడే. తను విన్న మంచి మాటలు ఇతరులకి చెప్పేదాకా ఇతనికి తోచదు." చెప్పాడా శిష్యుడు.

ఆ దర్భపుల్లని మూడో కపాలం చెవిలోంచి అతను పోనిస్తే అది మెడ కింద భాగంలోంచి బయటకి వచ్చింది. వెంటనే ఆ శిష్యుడు చెప్పాడు.

"ఇతను తను విన్న మంచి విషయాలన్నీ హృదయంలోకి పంపి, దాన్ని అచరించే స్వభావం గలవాడు కాబట్టి ఇతను మహాత్ముడయ్యాడు."

ఆ శిష్యుడు పరిపక్వత చెందడంతో గురువు అతన్ని పంపేసాడు.

## 55. కాకిలా జీవించు

ఓ సన్యాసి తన శిష్యుడితో ఓ గ్రామంలో ఓ రోజు ఒక పెద్ద చెట్టు కింద బస చేసాడు. ఆ చెట్టు ఎదురుగా ఉన్న ఇంటి యజమాని దగ్గరికి ఆ సన్యాసి శిష్యుడు వెళ్లి తనకి, తన గురువుకి భోజనం పెట్టమని కోరాడు. అయితే అతను ఏదో కుంటి సాకు చెప్పి తప్పించుకున్నాడు కాని వాళ్ళకి భిక్ష చెయ్యలేదు.

ఆ సన్యాసి మహానుభావుడని రెండు రోజుల్లోనే గ్రహించిన ఆ యజమాని ఆ రాత్రి సన్యాసి దగ్గరకి వెళ్ళి తనకేదైనా ఉపదేశం ఇవ్వమని కోరాడు.

"అలాగే. ఈ రోజునించి నువ్వు కాకులని బాగా పరిశీలించి చూస్తుండు." చెప్పాడా సన్యాసి.

ఏడాది తర్వాత ఆ సన్యాసి తిరిగి అదే దారిలో వెళ్తూ, తన శిష్యుడితో అదే చెట్టు కింద బస చేసాడు. ఈసారి ఆ ఇంటి యజమాని సన్యాసికి, అతని శిష్యుడికి వారు అడగకుండానే వారా గ్రామంలో ఉన్నన్ని రోజులూ భోజనాల ఏర్పాటు తనే చేసాడు.

ఆ గ్రామం విడిచి వెళుతూ ఆ శిష్యుడు తన ఆసక్తిని అణచుకోలేక అతన్ని అడిగాడు.

"ఈ ఏడాదిలో మీలోని పిసినారితనాన్ని ఎలా పోగొట్టుకోగలిగారో దయచేసి నాకు చెప్తారా?"

"మీ గురువుగారి చలవే అది. కాకులని పరిశీలించమని చెప్పారు. ఆ పని ఇన్నాళ్ళూ చేయబట్టి నేను మారగలిగాను." బదులు చెప్పాడతను.

"దానికీ దీనికీ ఏమిటి సంబంధం?" అర్థంకాక అడిగాడా శిష్యుడు.

"చాలా ఉంది. ఓ కాకికి ఆహారం కనపడగానే అది వెంటనే తినదు. ముందు వెళ్ళి ఇతర కాకులని పిలుచుకు వచ్చాక, సాటి కాకులతో కలిసి తింటుందది. వాటిని చాలా వారాలు పరిశీలించి చూసాక వాటికి గల ఈ బుద్ధి నాకు లేదే అన్న ఆలోచన ఓ రోజు నాకు కలిగింది. అప్పుడు మీ గురువుగారు నన్ను కాకులని ఎందుకు పరిశీలించమన్నారో అర్థమైంది. అ రోజునించి నేను నా పిసినారితనం వదిలి ఇతరులకి పెట్టి కాని నేను తినకూడదన్న పాఠం నేర్చుకున్నాను." వివరించాడతను.

## 56. దాన ఫలం

ఓ రోజు ఒకడు దారిన పోతూంటే, ఒంటిమీద నూలుపోగు లేని ఓ బిచ్చగాడు కనిపించాడు. అది చలికాలం కాబట్టి అతను ఆ బిచ్చగాడికి తన ఇంట్లో అదనంగా ఉన్న ఓ కంబళిని తెచ్చి ఇచ్చాడు.

కొద్ది కాలానికి అతను మరణించి చిత్రగుప్తుడి ముందు ప్రవేశ పెట్టబడ్డాడు. ఆ సమయంలో ఆ బిచ్చగాడు కూడా అక్కడే ఉన్నాడు. చిత్రగుప్తుడు ఆ ఇద్దరి పాప పుణ్యాలు లెక్కచూసి బిచ్చగాడ్ని వందేళ్ళు, అతనికి కంబళిని కప్పినతన్ని రెండు రోజులు స్వర్గంలో ఉంచమని యమభటులని అజ్ఞాపించాడు.